ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక TGTEL/25/A0827
ఆదివారం 19 ఏప్రిల్ 2026

# బిజెపితో పొత్తు... తెలుగుదేశం పార్టీకి ప్రమాదకరమే..!

మొదటి పేజీ తరువాయి...

భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇపడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోకసేభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెపకొచ్చారు.

## తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్రమంత్రి విందు

తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర నుంచి కేంద్రమంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఎలక్ట్రిక బస్సుల కేటాయింపులు చేశామని.. త్వరలో అందజేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని.. కానీ విపక్షాలు వ్యతిరేకించాయన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని ఆశిద్దామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లకణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

## గొడ్డలి పార్టీ ఆగడాలను అడ్డుకుంటాం

మొదటి పేజీ తరువాయి...

పూర్తి చేస్తామని అన్నారు. గోదావరి పుష్కరాలను మూడోసారి నిర్వహించే అదృష్టం తనకే దక్కిందని అన్నారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో, 2024లో వచ్చిన మెజార్టీ ఎపడూ చూడలేదని ప్రస్తావించారు. తెలిపారు. అమరావతి రాజధానిగా కేంద్రం ఓ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం మరువలేనిదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేసి, పేదలకు అన్నం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గొడ్డలి పార్టీ ఉందని. పేదల సమస్యలు పట్టవని ధ్వజమెత్తారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టడానికి జగన్ అండ్ కోకు మనసొప్పదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టలేని పార్టీలు ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటేనని ఆగ్రహించారు. అందరినీ నరుకుతామని చెప్పి, నరబలి ఇస్తామని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడ ఉన్నది 1995 సీబీఎన్.. ఆ గొడ్డలి పార్టీ ఆగడాలను సాగనివ్వనని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డలను చట్టసభల్లో చూడాలనేదే తన ఆకాంక్ష అని చెపకొచ్చారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు మనుగడ సాగించలేకుండా చేయాలని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎన్నికల ముందు చెప్పానని తెలిపారు. 'మన ఇల్లు - మన వీధి - మన ఊరు' అనే ఆలోచన ప్రజలకు రావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కోసం 15 నెలలుగా కష్టపడుతున్నానని పేర్కొన్నారు. ఈ శనివారం 'జలధార జలహారతి' అనే థీమ్‌తో ముందుకు వచ్చానని, వంద రోజులు కార్యాచరణతో పనిచేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలో నూటికి నూరు శాతం చెత్తను సేకరించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. చెత్తే మన సమస్య మన ఆరోగ్యానికి సమస్య అని చెప్పారు. 13 నగరాల్లో స్వీపింగ్ యంత్రాలు తెస్తున్నామని.. టెండర్లు పిలిచామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స ను సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ప్రతీనెల పేదల సేవలో 60 లక్షల మందికి, ఏడాదికి రూ.33వేల కోట్లతో పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. అక్వాకల్చర్‌ను పరిశ్రమగా తీసుకెళ్లాలని సూచించారు. అక్వా కల్చర్‌తో కొంత కాలుష్య సమస్యలు వస్తున్నాయని ప్రస్తావించారు. ఆ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుని, అక్వాను అభివృద్ధి చేస్తామని చెపకొచ్చారు. సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనలో తక్కువ అభివృద్ధి చూపించిన శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలకు వస్తానని తెలిపారు. బాగా పనిచేస్తే అభినందిస్తానని.. లేకపోతే పని నేర్పిస్తానని, అప్పటికీ బాగాలేకపోతే ఇక బాగుండదని హెచ్చరించారు. అధికారులు, తాను ప్రజలకు సేవకులం మాత్రమేనని.. పెత్తందార్లం కామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలకు వ్యసనాలు ఉన్నాయని.. ఆ వ్యసనాలు పోవాలని సీఎం చంద్రబాబు మందలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్‌లు పాల్గొన్నారు.

## మహిళా బిల్లును అడ్డుకోవడం చారిత్రక తప్పిదం

మొదటి పేజీ తరువాయి...

చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. 50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోకసేభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు. ఇండియా కూటమి నేతలు కుట్ర చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల బిల్లును అడ్డుకున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద్వ వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు 7 సార్లు బిల్లు పాస్ కాకుండా అడ్డుకుందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీయోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకొచ్చారని అన్నారు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకొని విపక్షాలు తప చేశాయన్నారు.

## విపక్షాల తప్పుకు... మూల్యం చెల్లించక తప్పదు

మొదటి పేజీ తరువాయి...

తెచ్చిన బిల్లును ప్రతిపక్ష నేతలు అడ్డుకున్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తీసుకోవాలని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేశాం. అన్ని రాష్ట్రాలకు సమాన బలం దక్కేలా బిల్లు తీసుకొచ్చాం. మహిళా బిల్లును అడ్డుకొని విపక్షాలు భ్రూణహత్యకు పాల్పడ్డాయి. ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ పార్టీలదే. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం విపక్షాలకు ఇష్టం లేదు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ.. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో చాలాసార్లు అడ్డుకుంది. మహిళా బిల్లును అడ్డుకొని విపక్ష పార్టీలు నిజస్వరూపం చూపించాయి. కాంగ్రెస్ పార్టీ పరాన్న జీవిలా బతికేస్తోంది. స్థానిక పార్టీలపై ఆధారపడి ఆ పార్టీ జీవిస్తోంది. మహిళా బిల్లుపై అవే కుట్రలు, కుతంత్రాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ, డీఎంకేకు ప్రజలు బుద్ధి చెబుతారు. నారీశక్తి వందన్ అధినియం బిల్లు వ్యతిరేకులు తగిన మూల్యం చెల్లించుకుంటారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసత్యాలు ప్రచారం చేశాయి. స్వార్థ రాజకీయాలతో ఆయా రాష్ట్రాల ప్రజలనూ మోసం చేస్తున్నాయి. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టంగా చెప్పాను. అన్ని రాష్ట్రాలకు లోక్ సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని హామీ ఇచ్చాను. బిల్లు ఆమోదం పొందితే అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరిగేవి. సీట్లు పెరిగితే కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి అన్ని పార్టీలకు ప్రయోజనమే. రామ్ మనోహర్ లోహియా స్వప్నాలను సమాజ్‌వాదీ పార్టీ తుంగలో తొక్కింది. కాంగ్రెస్ పార్టీ సంస్కరణలకు ఎపడూ వ్యతిరేకమే. జన్‌ధన్, డిజిటల్ పేమెంట్స్, జీఎస్టీని, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక రద్దును కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ఈ సందర్భంగా మోడీ ప్రస్తావించారు. ఉగ్రవాదం, నక్సలిజం విషయాల్లోనూ కాంగ్రెస్ వైఖరి మర్చిపోలేం. సంస్కరణ పేరు వింటే చాలు, కాంగ్రెస్ వెంటనే వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. ఆ పార్టీవన్నీ నెగటివ్ రాజకీయాలు. ఏ సంస్కరణ వచ్చినా కాంగ్రెస్ అడ్డుకుని దుష్ప్రచారం చేస్తుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. దేశానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం. సైనికుల వన్ ర్యాంక, వన్ పెన్షన్‌ను 40 ఏళ్లపాటు కాంగ్రెస్ అడ్డుకుంది. దేశంలోని మహిళలు, యువతులు కలిసి కాంగ్రెస్‌కు గట్టిగా జవాబిస్తారని మోదీ అన్నారు.

## కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు

మొదటి పేజీ తరువాయి...

విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డిపై ప్రియాంక గాంధీ ప్రశంసలు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరపున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో రేవంత్ కృషిని ప్రియాంక గాంధీ అభినందించారని ఆయన వెల్లడించారు.

## తమిళ సంస్కృతిని దెబ్బతీసేందుకు బిజెపి కుట్రలు

మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించు కోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారం పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తు న్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు.

## జగన్ నీచపు పనితో..... వైయస్సార్ ఆత్మ ఘోషిస్తుంది

జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీ లిమిటేషన్‌కి లింక పెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం బిజెపి పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా.. అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం.. అని నిలదీశారు. మహానేత వైఎస్సార్ సిద్ధాంతాలను మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మహిళలకు అగ్రతాంబూలం అందిస్తుంటే అభ్యంతరం ఎవరికీ లేదని అన్నారు. కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యత ఒకటేనని చెపకొచ్చారు. మహిళా బిల్లు పాస్ అయ్యింది 2023లోనేనని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనపై, మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్టాండ్ క్లియర్‌గా ఉందని వ్యాఖ్యానించారు. 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలని షర్మిల సూచించారు. కులగణన ద్వారా సంఖ్య తేలాలని అన్నారు. కులాల ఆధారంగా డీ లిమిటేషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుత 543 స్థానాలకు తక్షణం మహిళా రిజర్వేషన్లను పాటించాలని సూచించారు. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని సమ్మతమైన పరిష్కారం చూపాలని అన్నారు. అధికారిక గణాంకాలు లేకుండా 50 శాతం పెంచి దేశాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ చెబితే గుడ్డిగా జగన్ సైతం నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు.

## మహిళా బిల్లుపై నిరసనలు

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గృహ నిర్బంధం చేశారు. లోక సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.

## పునర్విక‌కు 16 కోట్ల ఇంజక్షన్

అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోపీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమైన విషయం తెలిసిందే. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చగా.. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు స్పందించిన మంత్రి నారా లోకేశ్ . మిగతా రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో హామీ ఇచ్చారు. ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్ స్మా ఇంజెక్షన్‌ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు. ఈ నేపథ్యంలో 'నా హామీ నెరవేరింది. పునర్వికకు ఈ రోజు ఇంజెక్షన్ చేశారు. నూరేళ్లు జీవించు చిట్టి తల్లీ' అని పేర్కొంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. తమకు అండగా నిలిచి, తమ పాప ప్రాణాల్ని కాపాడేందుకు సాయం చేసిన మంత్రి లోకేశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో పునర్వికను బతికించాలని డొనేషన్స్ పేరుతో మహా యజ్ఞమే జరిగింది. ఎట్టకేలకు ప్రభుత్వం సైతం దిగి వచ్చింది. సోషల్ మీడియాలో వచ్చిన డోనేషన్‌తో పాటు ప్రభుత్వం సహాయం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ముందుకు వచ్చారు. ఇంజక్షన్ అమెరికా నుంచి హైదరాబాద్ తెప్పించడానికి సాయం చేశారు. రూ. 16 కోట్లలో రూ. 10 కోట్ల విరాళాలు సేకరించగా.. మిగిలిన రూ.6 కోట్లు సమీకరించారు. పుర్విక భవిష్యత్తుకు సైతం హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగలి సురేశ్‌కుమార్, పుష్పావతి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె పునర్వికశ్రీ 2025 మే 12న జన్మించింది. పునర్విక ఆరు నెలలైన తన శరీరాన్ని కదిలించలేక పోయింది. దీంతో కంగారు పడిన పేరెంట్స్ సమీప కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆ డాక్టర్ల సిఫార్స్ మేరకు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పటల్‌కు తీసుకెళ్లారు.. చిన్నారిని పరిస్థితి, రిపోర్ట్స్‌ను పూర్తిగా పరిశీలించిన వైద్యులు అరుదైన సమస్యను గుర్తించారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే జన్యుపరమైన సమస్య ఉందని స్పష్టం చేశారు. అది వెన్నెముకలోని నరాల కణాలను దెబ్బతీసే ఒక జన్యుపరమైన వ్యాధి. ఇది కండరాల బలహీనత, క్షీణతకు దారితీస్తుంది. ఈ వ్యాధి వల్ల నడక, శ్వాస, మింగడం, కదలికలు కష్టమవుతాయి. ఇది తరచుగా పిల్లలలో కనిపిస్తుంది. దీనికి న్యూసినెర్సెన్, జో-జలెన్స్మా, రిస్డిఎ-లామ్ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఒక్క ఇంజెక్షన్ విలువ రూ. 16 కోట్లు ఉంటుంది. ఆ ఇంజెక్షన్ ద్వారా పునర్విక బతుకుతుందట. ఇక ఆ పాప బతకాలంటే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ అవసరమని ఓ ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్ గతంలో ఓ వీడియో రిలీజ్ చేశాడు. దీంతో తెలుగు యువత ఒక్కసారిగా ముందుకు వచ్చింది. ప్రభుత్వం సైతం స్పందించడంతో పునర్విక ప్రాణం నిలబడింది.

## మహిళా బిల్లుపై నిరసనలు

మొదటి పేజీ తరువాయి...

పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గృహ నిర్బంధం చేశారు. లోక సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.

## మళ్లీ మూతపడిన హర్మూజ్ జలసంధి

మొదటి పేజీ తరువాయి...

కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయక పోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టులన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తపడు సమచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

## డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

మొదటి పేజీ తరువాయి...

ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన పక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తం చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

## పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వ్యక్తిగత వైద్యుల సలహాతో కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లారు. పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేశారు. కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, దీర్ఘకాలం పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పూర్తి స్వస్థత చేకూరేందుకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# వేములవాడ పట్టణ అభివృద్ధియే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**-15వ వార్డులో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్.. క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ**



**వేములవాడ ప్రజాదివాస్ ఏప్రిల్ 18** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డులోని మురికి కాల్వల పూడికతీత పనులను దగ్గరుండి పరిశీలించిన చైర్మన్, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని మున్సిపల్ సిబ్బందికి, కార్మికులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా, దోమల వ్యాప్తి చెందకుండా ముందస్తుగా మురుగు నీటి కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు వివరించారు. 99 రోజుల ప్రణాళికతో క్షేత్రస్థాయి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వార్డులోని ప్రతి వీధిలో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడటమే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. పారిశుధ్య పనులతో పాటు వార్డులో కొత్తగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. అలాగే రవాణా సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు సంబంధించిన కొలతల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అనన్య, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై 'మహా ధర్నా

**-ఇందిరా పార్క్‌కు తరలిన వేములవాడ యూత్ కాంగ్రెస్ నేతలు !**

**- దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం: న్యాత నవీన్ విమర్శలు**

**- హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ మహా ధర్నా: న్యాత నవీన్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన నియోజకవర్గ నాయకులు**



**వేములవాడ ప్రజాదివాస్ ఏప్రిల్ 18**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ నాయకత్వంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆర్డినేటర్లు, పట్టణ నాయకులు మరియు ముఖ్య కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, అదానీ మరియు ట్రంప్ మధ్య జరిగిన రహస్య వ్యాపార ఒప్పందాల వల్ల దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని విమర్శించారు. ముఖ్యంగా భారత వ్యవసాయ మార్కెట్‌ను కుప్పకూల్చేలా నిర్ణయాలు తీసుకోవడం, పాడి రంగాన్ని విదేశీ సంస్థలకు విక్రయించడం మరియు 140 కోట్ల భారతీయుల వ్యక్తిగత డేటాను విదేశీ శక్తులకు అమ్మడం వంటి చర్యల ద్వారా జాతీయ సార్వభౌమాధికారాన్ని ప్రధాని మోదీ తాకట్టు పెట్టారని మండిపడ్డారు. స్థానిక పరిశ్రమలు మరియు ఎంఎస్‌ఎంఈలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, సామాన్యుల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ తన పోరాటాన్ని ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న యువజన కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్రానిది నియంతృత్వ వైఖరి.. మహిళా బిల్లుపై బీజేపీ డ్రామాలు చేస్తుంది

**-దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే ఊరుకోం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘాటు విమర్శలు**




**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 18**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గారు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోడీ గారు మరియు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారి ద్వయం రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం ప్రజాస్వామ్యానికి దక్కిన విజయమని పేర్కొంటూ, ఇది కేంద్ర ప్రభుత్వ అహంకారానికి తగిన సమాధానమని అభివర్ణించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. 2023లో ఆమోదం పొందిన బిల్లును 2024 ఎన్నికల్లో అమలు చేయకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు.రిజర్వేషన్ల అమలును నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడం మహిళల హక్కులను వాయిదా వేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా బిల్లును విడిగా తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గించడం అన్యాయమని పేర్కొన్నారు.ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ గారు పోరాడుతారని తెలిపారు...

**తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఆగ్రహం**

"తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన తేజస్వి సూర్య గారి వ్యాఖ్యలను కిషన్ రెడ్డి సమర్థించడం సిగ్గుచేటు. దీనిపై తెలంగాణ సమాజానికి ఆయన సమాధానం చెప్పాలి."కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, మహిళలను మరియు దక్షిణాది రాష్ట్రాలను మోసం చేసే ప్రయత్నాలకు తగిన సమయంలో ప్రజలే సమాధానం ఇస్తారని ఆయన హెచ్చరించారు.

# మహిళా బిల్లు వ్యతిరేకించిన రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**ముస్తాబాద్/ ఏప్రిల్ 18 ప్రజా దివాస్** 33% మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది దేశ సగం జనాభాకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం అంత కష్టమైన పనా? ప్రతిపక్షాల తీరు చూస్తుంటే వారికి అది ఇష్టం లేదని స్పష్టమైంది.రేపటి రోజున మహిళలు ఎక్కడ తమ అధికారాన్ని సవాలు చేస్తారో అనే అభద్రతాభావం, భయంతోనే.ప్రతిపక్షాలు నారీ శక్తి వందన్ అధినియం' అమలుకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకున్నాయి.నాడు యూపీఏ పాలనలో మహిళల ఆరోగ్యాన్ని, ఆత్మగౌరవాన్ని గాలికొదిలేశారు.నేడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే మహిళా వ్యతిరేక బుద్ధిని కొనసాగిస్తున్నారు.మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతికుమార్ మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 %శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని, ప్రధాని నరేంద్ర మోడీ తీసుకొచ్చిన ఈ బిల్లు మహిళల సాధికారతకు దోహదం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును వ్యతిరేకించడం ద్వారా మహిళల ఆశలను దెబ్బతీసిందని విమర్శించారు .మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. మహిళలను రాజకీయంగా అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటోందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి



గోపికృష్ణ,మండల ఉపాధ్యక్షులు గుండవేణి తిరుపతి,బాధ నరేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు చిగురు వెంకన్న,కుడుకల జనార్దన్,కరెడ్ల రమేష్ రెడ్డి,నర్ర ప్రశాంత్,పున్నం అనిల్,పిట్ల రాజు,కాసారపు రవి,నవీన్,పల్లె తిరుపతియాదగిరి,కదిరే తిరుపతి బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల శాఖ అధ్యక్షులు శ్రీ బుర్ర శేఖర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో మహిళా బిల్లుకు వ్యతిరేకంగా స్పందించిన ఇండియా కూటమిపై నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు**



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 18** వేములవాడ పట్టణంలోని నంది కమాన్ కూడలి వద్ద శనివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో ఇండియా కూటమి అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ, భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ నేతృత్వంలో తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలు, ఇండియా కూటమికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో మహిళా సాధికారతకు అత్యంత కీలకమైన మహిళా బిల్లును అడ్డుకోవాలని చూడటం శోచనీయమని మండిపడ్డారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తుంటే, ప్రతిపక్ష కూటమి అనవసర రాజకీయాలతో అడ్డుతగులుతోందని విమర్శించారు. మహిళా వ్యతిరేక ధోరణిని వీడాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం నంది కమాన్ వద్ద ఇండియా కూటమి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా బిల్లుకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## గాలివాన బీభత్సం: మరిమడ్ల - నిమ్మపల్లి రహదారిపై నిలిచిన రాకపోకలు





**కొనరావుపేట మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 18**

సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ప్రకృతి ప్రకోపించింది. శనివారం కురిసిన భారీ గాలివాన మండలంలోని మరిమడ్ల గ్రామంలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల ధాటికి మరిమడ్ల – నిమ్మపల్లి ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద చెట్లు ఒక్కసారిగా రోడ్డుపై విరిగిపడటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**బారులు తీరిన వాహనాలు.. ప్రయాణికుల అవస్థలు**

ప్రధాన రహదారిపై చెట్లు అడ్డంగా పడటంతో రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. అటు మండల కేంద్రానికి వెళ్లే వాహనాలు కూడా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో కిలోమీట ర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంట ున్నారు. కాగా, రహదారిపై అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు స్థానికులు, వాహనదారులు శ్రమిస్తున్నారు. అధికారులకు సమాచారం అందించినప్పటికీ, సహాయక చర్యలు వేగవంతం కావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రోడ్ సేఫ్టీ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశంసలు

### సర్టిఫికెట్లు అందించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -18 ప్రజా దివాస్** జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆద్వర్యంలో ఈ ఏడాది జనవరి 1 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేయించారు. అలాగే జిల్లాలోని పలు విద్యాసంస్థల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై వ్యాస రచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై కుటుంబ సభ్యులకు, సమీప ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, వివిధ పాఠశాలల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించిన హీరోయిన్ అనన్య నాగళ్ల



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 18** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సినీ హీరోయిన్ అనన్య నాగళ్ల దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈవో భాస్కర శర్మ ఆమెకు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఇక 'లీసా' సినిమా షూటింగ్‌ను కరీంనగర్‌లో పూర్తి చేసుకున్న సందర్భంగా, చిత్ర యూనిట్ సభ్యులు కూడా ఈ దర్శనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సతీష్ రెడ్డి, వీడియో గ్రాఫర్, డైరెక్టర్ జోహార్, ప్రొడ్యూసర్ చందు, అలాగే ప్రొడ్యూసర్ బీరప్ప నేని శివ పాల్గొన్నారు.

## దేన్యతండా అంగన్వాడీలో పోషణ పక్షం కార్యక్రమం




**చింతపల్లి- ప్రజాదివాస్ ఏప్రిల్ 18** పోశన పక్షం కార్యక్రమంలో భాగంగా శనివారం చింతపల్లి మండలం దేన్యత ండా గ్రామపంచాయతీ అంగ న్వాడి సెంటర్లో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పోషకాహారం గురించి వివరించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సర్పం చ్ రమావత్ కొండల్ నాయక్, సెక్రటరీ ఎం.చంద్ర శేఖర్, సూపర్వైజర్ ప్రసన్న, స్కూల్ టీచర్ జి.హైమ ఆశ వర్కర్ విజయ, అంగన్వాడీ టీచర్ ఆర్ పద్మ, సునీత, మోతిబాయ్,పిల్లలు,తల్లి తండ్రులు,గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## మద్యం సేవించి పట్టుపడితే గరిష్టంగా ఆరు నెలల జైలు శిక్ష తప్పదు

### మద్యం సేవించి పట్టుబడిన 18 మంది మందు బాబులకు జైలు శిక్షలు.

### జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్ గారు.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ఏప్రిల్ 18 ప్రజా దివాస్**
సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ల లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 20 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడగా వారిని పోలీసులు ఈరోజు సిరిసిల్ల కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ ప్రవీణ్ గారు జైలు శిక్షలు,జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ గారు తెలిపారు..

**విధించిన జైలు శిక్ష,జరిమానాల వివరాలు.**

1.09 మందికి ఒక రోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి ?4000,రూపాయల జరిమాన. 2.07 మందికి రెండు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి ?5000 రూ. జరిమానా3 .ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి ?50004. ఇద్దరికి ఒక్కొక్కరికి 10,000/- రూపాయల జరిమాన.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ' కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున పడేయొద్దని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల తమతో పాటు ఎదురుగా వచ్చే వారి కుటుంబాల్లో కూడా విషాదం నింపవద్దని హెచ్చరించారు.మద్యం సేవించి కేసుల పలు అయితే భవిష్యత్తులో ఉద్యోగ మరియు ఉపా ధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చని హెచ్చరించారు.అలాగే ట్రాఫిక్ మరియు రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని,మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

### - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### - యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -18 ప్రజా దివాస్** ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. కూలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పిలుపునిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా కేంద్రాలకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఆన్లైన్ ప్రక్రియ, మిల్లుల కేటాయింపు పూర్తి చేయాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు వల్ల దళిత క్రైస్తవులకు అన్యాయం

### - పాస్టర్స్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా

### - ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ఏప్రిల్ 18 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పు వలన దళిత క్రైస్తవులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా మత స్వేచ్ఛ ఉంటుందని రాజ్యాంగానికి విరుద్ధంగా తీర్పు రావడంతో దళిత క్రైస్తవులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. కులం వేరు మతం వేరు కులం పుట్టుకతో వస్తుందని కానీ మతం నమ్మకానికి సంబంధించిందని మతం ఎప్పుడైనా మారతారని కులం మాత్రం ఎప్పటికీ అలాగే ఉంటుందని అన్నారు. చట్ట సవరణ విషయంలో దళిత క్రైస్తవులకు మద్దతుగా మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. దళిత క్రైస్తవులు అణచివేతకు గురవుతున్నారని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యం అవుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్ మాట్లాడుతూ ఐక్యతతో ఉన్న క్రైస్తవులను విడగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని క్రైస్తవులను కులాల వారిగా విభజించి ఐక్యతను విరిచి వేయాలని చూస్తున్నారని అన్నారు. క్రైస్తవ్యంలో అన్ని కులాల వారు ఉన్నారని కానీ దళిత క్రైస్తవులకు మాత్రమే సుప్రీంకోర్టు తీర్పు ద్వారా విడదీసే కుట్ర జరుగుతుందని అన్నారు. దళిత క్రైస్తవులను భయభ్రాంతులకు గురి చేయడానికి ఈ తీర్పు వచ్చిందని క్రైస్తవులందరూ ఒక్కతాటిపై ఉండి దళిత క్రైస్తవులకు న్యాయం జరిగే వరకు కలసి పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దళిత క్రైస్తవుల పోరాటానికి దళిత సంఘాలు, ముస్లిం మైనార్టీలు అందరూ కూడా ఐక్యమత్యంతో కలిసి రావాలని దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనుకకు తీసుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి ఎలీషా, దేవయ్య, జాయింట్ సెక్రెటరీ నతానియల్, మీడియా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్, ఈసీ మెంబర్లు ప్రసాద్, స్టీరింగ్ కమిటీ సభ్యులు విద్యానందం, పౌల్, పాస్టర్లు ఏసు పాల్, ఐజయ్య, బి క్రీస్తు దాస్, గిద్యోను, జాన్, సంసోన్, తదితరులు పాల్గొన్నారు,

## హనుమాన్ దేవాలయం నిర్మాణం కోసం దాతల కృషి

### ఆలయ కమిటీ చైర్మన్ సిందం అంజయ్య



**యాచారం ప్రజాదివాస్:.** మండల పరిధిలో నకర్త మేడిపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయం పునర్నిర్మాణం కోసం దాతల కృషి ఎంతో అమోఘమైందని ఆలయ కమిటీ చైర్మన్ అంజయ్య అన్నారు. శనివారం అదే గ్రామానికి చెందిన దాతలు 1 కర్నాటి అరుణమ్మ కీర్తిశేషులు శ్రీనివాస్ రెడ్డి 10 లక్షలు , 2 లిక్కి నిర్మలమ్మ కీర్తిశేషులు కృష్ణారెడ్డి (మాజీ సర్పంచ్) 2.50 లక్షలు, 3 కర్నాటి పద్మ కృష్ణారెడ్డి 15 లక్షలు, 4 ఆలంపల్లి శాంతమ్మ కీర్తిశేషులు చంద్రయ్య,9 వార్డు సభ్యులు మహేష్ 1 లక్ష దైవభక్తితో ఆర్థికంగా సహకరించారు. వారి కుటుంబ సభ్యులు ఆయు ఆరోగ్యాలతో సుఖశాంతులతో, జీవితంలో ఎదగాలని హనుమంతుడు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండ రాజు, మాజీ సర్పంచ్ పాచ్చ భాష,, కలకొండ బీరప్ప, కలకొండ అంజయ్య, కలకొండ శివకుమార్, పాచ్చ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.